ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రత ఆదివారం గరిష్టం : 38.0 కనిష్టం : 27.0
ANDHRAJYOTHY


అనంతపురం
జిల్లా వార్తలు
సోమవారం 7 ఏప్రిల్ 2025


మూడోరోడ్డు జీఆర్ ఫంక్షన్ హాల్ వద్ద ఉట్లమాను పరుష


మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వరాలయంలో కల్యాణోత్సవంలో మంగళసూత్రాన్ని చూపుతున్న వేదపండితుడు




రెవెన్యూ కాలనీ రామాలయంలో ప్రత్యేక అలంకరణలో హనుమద్ సమేత సీతారామలక్ష్మణులు



జై శ్రీరామ్..

వైభవోపేతంగా శ్రీరాముడి శోభాయాత్ర

వేలాదిగా తరలి వచ్చిన భక్తులు

మార్మోగిన రామనామం

కిక్కిరిసిన అనంత వీధులు

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): అనంత వీధుల్లో రామనామం మార్మోగింది. జై శ్రీరామ్ నినాదాలతో పులకించిపోయింది. శ్రీరామనవమిని పురస్కరించుకుని ఆదివారం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో అనంతపురం జిల్లా కేంద్రంలో వేలాది మంది రామభక్తులతో మెగా బైక్ర్యాలీ, శ్రీరాముడి శోభాయాత్రను వైభవోపేతంగా నిర్వహించారు. అంతకుముందు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జనసేన పార్టీ కార్యక్రమాల కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భవాని రవికుమార్ అధ్యక్షతన నిర్వహించిన సభకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, తెలంగాణకు చెందిన ఎంపీ రఘునందనరావు హాజరయ్యారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ... సర్వధర్మ స్వరూపుడు శ్రీరాముడు అనీ, ఆయన జీవితాన్ని ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పేర్కొన్నారు. ధర్మ పరిరక్షణ కోసం వానరుడైన సుగ్రీవుడు, పక్షి అయిన జటాయువుతో సైతం శ్రీరాముడు స్నేహం చేశాడన్నారు. రామాయణం చదివితే చాలు జీవితానికి సార్థకత చేకూరుతుందన్నారు. 'శ్రీరాముడు అయోధ్యలోనే జన్మించాడా?' అని ఎంతో మంది ప్రశ్నించినా ప్రధాని మోదీ వెనకాడకుండా పురాణాలపై విశ్వాసంతో అనేక సంవత్సరాలు పోరాడి అయోధ్యలో బాలరాముడిని ప్రతిష్ఠించాడన్నారు. శ్రీరాముడి శోభాయాత్రకు వేలాదిమంది తరలిరావడం శుభపరిణామమన్నారు. వచ్చే ఏడాది ఆ సంఖ్య లక్షల్లో పెరగాలని ఆకాంక్షించారు. ఎంపీ రఘునందనరావు మాట్లాడుతూ.. మానవుడిగా జన్మించినప్పటికీ మాధవుడిగా మారిన మహనీయుడు శ్రీరాముడు అని పేర్కొన్నారు. హైదరాబాద్లో నిర్వహించే రాముడి శోభాయాత్రకు ఏమాత్రం తీసిపోకుండా అనంతపురంలోనూ భక్తజనం తరలిరావడం ఆనందంగా ఉందన్నారు. కులం, మతం పేరుతో విడిపోకుండా హిందువులంతా సంఘటితంగా మెలగాలన్నారు. దేశాన్ని కాపాడేది ఒక్క హిందూ చైతన్యం మాత్రమేనన్నారు. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ప్రతి గల్లీలో ప్రతి హిందువు మదిలోనూ రామనామం ధ్వనిస్తోందన్నారు. రామరాజ్యస్థాపనతోనే ధర్మ పరిరక్షణ సాధ్యమన్నారు. కార్యక్రమంలో శ్రీరామ ఉత్సవ సమితి కన్వీనర్ శబరి వరప్రసాద్, మాజీ మేయర్ స్వరూప, మాజీ జడ్పీటీసీ విశాలాక్షి, చిన్మయా మిషన్ ప్రతినిధి స్వామి ఆత్మవిదానంద సరస్వతి, వీహెచ్పి జిల్లా అధ్యక్షుడు తాళంకి వెంకటరత్నమయ్య, వీహెచ్పీ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటరమణబాబు పాల్గొన్నారు.

ఊరూరా వేడుకలు..

శ్రీరామ నవమి వేడుకలను ఆదివారం ఊరూరా వైభవంగా నిర్వహించారు. సీతారాముల కల్యాణోత్సవం కనులపండువగా చేశారు. ఉట్ల పరుష, ఎద్దుల బండ్ల పోటీలు సందడిగా సాగాయి. గ్రామోత్సవాలు నిర్వహించారు. రామయ్య నామస్మరణతో జిల్లా మార్మోగింది.


అభివాదం చేస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎంపీ రఘునందనరావు


క్రిష్ణకళామందిరంలో సీతారాముల కల్యాణోత్సవంలో పాల్గొన్న కలెక్టర్ దంపతులు


లక్ష్మీనగర్ రామాలయంలో హనుమద్ సమేత సీతారాముల దర్శనం


మహిళా భక్తుల కోలాటం


మెగా బైక్ ర్యాలీలో పాల్గొన్న భక్తులు


మొదటి రోడ్డు శివాలయంలో కల్యాణోత్సవాన్ని వీక్షిస్తున్న భక్తులు



అధికార దర్పం.. సామాన్యుడిపై జులుం..!



తాడిపత్రి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): గోబీ సెంటర్ నిర్వాహకుడిపై ఓ ఉన్నతాధికారి దర్పం ప్రదర్శించారు. అడిగిన వెంటనే గోబీ ఇవ్వలేదన్న కోపంతో వ్యవహారాన్ని పోలీసుల వరకు తీసుకెళ్లి చిరు వ్యాపారిపై జులుం ప్రదర్శించారు. పోలీసులు కూడా అధికారి మాటలు విని చిరు వ్యాపారిని చితకబాదినట్లు తెలుస్తోంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని సీబీరోడ్డులో ఓ గోబీసెంటర్ వద్దకు శనివారం రాత్రి నెల్లూరు జిల్లాకు చెందిన ఆర్డీఓస్థాయి అధికారి వచ్చారు. గోబీ ఇవ్వాలని అడిగారు. కొంత ఆలస్యం కావడంతో గోబీ సెంటర్ నిర్వాహకుడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 'నేను ఎవరు అనుకున్నావ్.. తమాషా చేస్తున్నావా..' అంటూ బెదిరింపులకు దిగడంతో అదే స్థాయిలో నిర్వాహకుడు కూడా వాదనకు దిగాడు. అక్కడే ఉన్న స్థానికులు ఇద్దరికీ సర్దిచెప్పినా వినకపోవడంతో ఆ అధికారి పోలీసులకు ఫోన్ చేశారు. దీంతో వారు.. నిర్వాహకుడిని పోలీస్స్టేషన్కు తరలించి చితకబాదారు. దీనిని చూసిన సామాన్యులు అధికారి అయినంత మాత్రాన చిరువ్యాపారిపై ప్రతాపం చూపుతాడా.. అని విమర్శిస్తున్నారు. పొట్టకూటికోసం గోబీ సెంటర్ నిర్వహించుకునే వ్యక్తిని పోలీసులు చితకబాదడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.


కసాపురంలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కమనీయం..

గుంతకల్లు, ఏప్రిల్6(ఆంధ్రజ్యోతి): సీతమ్మ పెండ్లి కుమార్తెగా, శ్రీరామచంద్రుడు పెండ్లి కుమారుడిగా కొలువుదీరితే.. కల్యాణ వేదికే మురిసిపోయింది. సీతమ్మ మెడలో రామయ్య మాంగల్య ధారణ గావించి, ముత్యాల తలంబ్రాలు పోసుకోవడంతో చూసిన వారందరూ తన్మయత్వం పొందారు. శ్రీరామ నవమి పండుగను పురస్కరించుకుని ఆదివారం ఉదయం కసాపురంలోని శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో సీతారాముల కళ్యాణోత్సవం కమనీయంగా సాగింది. ఆలయంలో ఉదయాన్నే నెట్టికంటి మూల విరాట్టుకు ప్రత్యేక అలంకారాలు, వజ్రకవచాలంకారాలు చేసి, పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో వేదికను ఏర్పాటుచేసి, శ్రీసీతారాముల ఉత్సవ విగ్రహాలను సర్వాంగ సుందరంగా అలంకారించి, కల్యాణం నిర్వహించారు. రాత్రి స్వామివార్ల ప్రాకారోత్సవాన్ని కనుల పండువగా చేశారు. కార్యక్రమాల్లో ఆలయ ఈఓ వాణి, ధర్మకర్త సుగుణమ్మ, ఏఈఓ వెంకటేశ్వరుడు, సూపరింటెండెంట్ పిడికిటి వెంకటేశులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

రోడ్ల అభివృద్ధికి రూ.7.50 కోట్లు

ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్



అనంతపురం అర్బన్/ఉరవకొండ, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): ఉరవకొండ నియోజకవర్గంలో ఆర్అండ్బీ పరిధిలోని మూడు ప్రధాన రాష్ట్ర, జిల్లా రహదారుల అభివృద్ధికి రూ.7.50 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. హావలిగి రోడ్డు నుంచి ఉరవకొండ వరకు నాలుగు కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి రూ.2 కోట్లు, రామసాగరం, బోరంపల్లి మధ్య 3.3 కిలోమీటర్లకు రూ.1.50 కోట్లు, ఉరవకొండ, కణేకల్లు మధ్య 8 కిలోమీటర్లకు రూ.4 కోట్లు మంజూరయ్యాయన్నారు.

నేడు ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక

అనంతపురం టౌన్, ఏప్రిల్6(ఆంధ్రజ్యోతి): స్థానిక కలెక్టరేట్లోని రెవెన్యూ భవన్లో సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ వినోద్కుమార్ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

హాకీకి పూర్వవైభవం తీసుకొస్తాం

మంత్రి సత్యకుమార్ యాదవ్

15వ రాష్ట్రస్థాయి హాకీ టోర్నీ ప్రారంభం

(7లో..)

సమ్మెలోకి తాగునీటి కార్మికులు

(7లో..)

నార్పల క్రీడా వికాస కేంద్రం



శాప్ కోచ్ పరారీ

నార్పల స్టేడియంలో నిధుల దుర్వినియోగం

ప్రభుత్వ నిధులతో కోచ్ పరార్

● గత డీఎస్డీఓకు వాటా ● క్రీడాశాఖలో మరో ఉదంతం వెలుగులోకి..

అనంతపురం క్లాక్టవర్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): గతంలో పనిచేసిన డీఎస్డీఓ (జిల్లా క్రీడాభివృద్ధి అధికారి) అరాచకాల్లో మరో ఘటన వెలుగులోకి వచ్చింది. నార్పల క్రీడా వికాసకేంద్రంలో పనిచేస్తున్న కోచ్ రమేష్ నిధులతో పరారయ్యాడు. గత డీఎస్డీఓ షఫీ సహకారంతో సుమారు రూ.5లక్షలు నిధులు తన సొంతానికి వాడుకుని అదృశ్యమయ్యాడు. విధులకు హాజరు కాకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం, నార్పల స్టేడియంలో వచ్చే ఆదాయాన్ని గత డీఎస్డీఓ షఫీతో వాటాలు పంచుకుని దుర్వినియోగానికి పాల్పడినట్లు ఆ శాఖలో జోరుగా చర్చసాగుతోంది. జనరేటర్ అమ్ముకోవడం, డిపాజిట్ సొమ్ము దుర్వినియోగం చేసిన ఆరోపణలతో గత డీఎస్డీఓ షఫీపై ప్రభుత్వం సస్పెన్షన్ వేటు వేసింది. ఈ క్రమంలో గత డీఎస్డీఓ షఫీపై క్రిమినల్ కేసు నమోదుకు శాప్ ఉన్నతాధికారులు, చైర్మన్ ఆదేశించారు. తాజాగా నార్పల ఘటన వెలుగులోకి వచ్చింది. తవ్వే కొద్దీ గత డీఎస్డీఓ షఫీ అక్రమాలు బయటపడుతున్నాయి. సుమారు రూ.6లక్షల వరకు నిధులు సొంతానికి వాడుకున్న నార్పల కోచ్కు సహకరించడం, విధులకు హాజరుకాకపోయినా వేతనం చెల్లించిన వాటిలో గత డీఎస్డీఓ షఫీ కీలకపాత్ర పోషించినట్లు తెలుస్తోంది.

నార్పలలో ఉన్న శాప్, డీఎస్ఏకు సంబంధించిన క్రీడావికాసకేంద్రం (స్టేడియం)లో పనిచేస్తున్న జూడో కోచ్ రమేష్ పరార్ అయ్యాడు. గత ఆరు నెలలుగా కోచ్ అందుబాటులో లేడని క్రీడా శాఖ ఉద్యోగులు చెబుతున్నారు. గతేడాది నవంబరు నెల నుంచి నార్పల స్టేడియంలో షాపింగ్ కాంప్లెక్స్, క్రీడాకారుల సాధారణ ఫీజులకు సంబంధించి మొత్తాన్ని శాప్కు చెల్లించకుండా సొంతానికి వాడుకున్నారు. విధులకు హాజరుకాకపోయినా అప్పటి డీఎస్డీఓ షఫీ జీతాలు చెల్లించారు. నిధుల దుర్వినియోగం చేసిన మొత్తంలో అప్పటి డీఎస్డీఓ, కోచ్లు పంచుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నవంబరు వరకు జీతాలు చెల్లించడంతో పాటు నార్పల స్టేడియంలో వచ్చే ఆదాయంలో చెరిసగం పంచున్నట్లు చెబుతున్నారు. కొత్తగా వచ్చిన డీఎస్డీఓ జనవరిలో కోచ్ విధుల పట్ల నిర్లక్ష్యం, ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగాన్ని గుర్తించినట్లు తెలిసింది. ఇక మార్చి నెలలో కోచ్కు జీతం నిలుపుదల చేసి, పోలీస్స్టేషన్లో ఫిర్యాదు చేశారు. మొత్తం రూ.3లక్షల వరకు క్రీడా శాఖకు కోచ్ రమేష్ చెల్లించాల్సి ఉందని చెబుతున్నారు.


నార్పలలో డీఎస్ఏ షాపింగ్ కాంప్లెక్స్

కార్యాలయ సిబ్బంది పర్యవేక్షణ

డీఎస్డీఓ కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులు దేవమణి, సుచీంద్ర, మరో కోచ్తో కమిటీ నియమించారు. ఈ కమిటీ నార్పలలో ఉండే క్రీడావికాస కేంద్రం, షాపింగ్కాంప్లెక్స్ను పర్యవేక్షిస్తుంది. ప్రతినెలా వచ్చే అద్దెతో పాటు క్రీడాకారుల సాధారణ ఫీజు మొత్తాన్ని నేరుగా శాప్కు పంపిస్తున్నారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న జూడో కోచ్ రమేష్ ఫీజు మొత్తాన్ని నగదు, ఫోన్పే ద్వారా తీసుకునేవారు. దీంతోనే నిధులు దుర్వినియోగమైంది. గతంలో డీఎస్డీఓగా పనిచేసిన షఫీకి కోచ్ చేసిన నిధుల దుర్వినియోగంలో వాటా ఉన్నట్లు తెలుస్తోంది. ఆరు నెలల కాలంలోనే సుమారు రూ.5లక్షల వరకు నిధులు దుర్వినియోగం చేసినట్లు సమాచారం. కోచ్, అప్పటి డీఎస్డీఓ చెరిసగం వాటా పంచుకున్నట్లు చర్చించుకుంటున్నారు.

పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశాం

నార్పల క్రీడావికాస కేంద్రంలో పనిచేస్తున్న జూడో కోచ్ రమేష్ కనిపించడం లేదన్నది వాస్తవమే. ఇప్పటికే నార్పల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాం. ప్రభుత్వానికి కోచ్ సుమారు రూ.2.6 లక్షలు కట్టాల్సి ఉంది. కేవీకేలో షాపింగ్ కాంప్లెక్స్ ఇతర ఫీజులు గత ఆరు నెలలుగా ప్రభుత్వానికి చెల్లించకుండా సొంతానికి వినియోగించుకున్నాడు. ఇదే విషయాన్ని పోలీసులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశాం. కోచ్ వస్తే కచ్చితంగా రికవరీ చేస్తాం.



-ఉదయ్భాస్కర్, డీఎస్డీఓ

హాకీకి పూర్వవైభవం తీసుకొస్తాం

మంత్రి సత్యకుమార్ యాదవ్

15వ రాష్ట్రస్థాయి హాకీ టోర్నీ ప్రారంభం



మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

ధర్మవరం, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): హాకీకి పూర్వ వైభవం తీసుకొస్తామని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో 15వ రాష్ట్రస్థాయి హాకీ టోర్నీని మంత్రి సత్యకుమార్ ఆదివారం ప్రారంభించారు. ముందుగా ఆయా జిల్లాల జట్ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. టోర్నీలో రాష్ట్రవ్యాప్తంగా 22 జట్లు పాల్గొన్నాయి. వీరిని మంత్రి పరిచయం చేసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ... చదువుతోపాటు క్రీడలు చాలా అవసరమన్నారు. కార్యక్రమంలో హాకీ అసోషియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బంధనాథం సూర్యప్రకాశ్, కార్యదర్శి హర్షవర్ధన్, కోశాధికారి థామస్, సౌత్ రైల్వే ఆఫీసర్ గీతారెడ్డి పాల్గొన్నారు.

చిత్తూరు చిత్తు..

మొదటి రోజు ఆదివారం నిర్వహించిన పోటీల్లో పలు జట్లు గెలుపొందాయి. కాకినాడ 10-0 తేడాతో చిత్తూరును చిత్తు చేసింది. ప్రకాశం 5-0తో నంద్యాలపై, శ్రీకాకుళం 3-2తో విశాఖపట్నంపై, అన్నమయ్య జట్టు 5-0 తేడాతో మాన్యం జట్టుపై, తిరుపతి 5-0తో నెల్లూరుపై, అనకాపల్లి 2-0తో పశ్చిమ గోదావరిపై, కడప 12-0తో కర్నూలుపై విజయం సాధించాయి.


సమ్మె చేస్తున్న కార్మికులు



సమ్మెలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర నేత ఓబులు

సమ్మెలోకి తాగునీటి కార్మికులు

వేతనాలు చెల్లిస్తేనే చర్చలకు వస్తాం..

సీఐటీయూ రాష్ట్ర నేత ఓబులు

కూడేరు, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్న అహోబిలం రిజర్వాయర్ (పీఏబీఆర్)లోని నీలకంఠాపురం శ్రీరామిరెడ్డి తాగునీటి పథకంలో పనిచేస్తున్న కార్మికులు వేతనాల కోసం సమ్మెబాట పట్టారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి తాగునీటి సరఫరా నిలిపివేసి, సమ్మె చేస్తున్నారు. దీంతో ఉమ్మడి అనంతపురం జిల్లాలో దాదాపు వెయ్యి గ్రామాలకు నీటి సరఫరా నిలిచిపోయింది. సీఐటీయూ రాష్ట్ర నేత ఓబులు.. కార్మికులకు మద్దతుగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. వేతన బకాయిల కోసం తాగునీటి పథకాల కార్మికులు ప్రతిసారీ సమ్మె చేయాల్సి వస్తోందన్నారు. ఉమ్మడి జిల్లాలో 600 మంది కార్మికులు పని చేస్తున్నారనీ, వీరందరికీ ఐదు నుంచి పది నెలల వరకు వేతనాలతో పాటు, పీఎఫ్ సొమ్ము నెలల తరబడి పెండింగ్ ఉందన్నారు. గతంలో సమ్మె చేసిన సమయంలో బకాయిలు చెల్లిస్తామని హామీ ఇచ్చిన ఉన్నతాధికారులు తరువాత విస్మరించారన్నారు. ప్రభుత్వం తక్షణమే నిధులు విడుదల చేయాలని, లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్మికుల వేతన, పీఎఫ్ బకాయిలు చెల్లిస్తేనే చర్చలకు వస్తామని స్పష్టం చేశారు. అంతకు ముందు తాగునీటి పంపులు బంద్ చేసి, ఆందోళనకు దిగారు. సమ్మెలో సీఐటీయూ నాయకులు, తాగునీటి కార్మికులు పాల్గొన్నారు.

తలారి రంగయ్య కుట్రలు

ఎమ్మెల్యే ప్రలోభ పెట్టారనడం అవాస్తవం

మాజీ ఎంపీపీ తలారి తిమ్మరాజమ్మ


మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ తలారి తిమ్మరాజమ్మ, ములకనూరు గోవిందు

కళ్యాణదుర్గం, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): వైసీపీ కళ్యాణదుర్గం నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలారి రంగయ్య రాజకీయంగా తమపై కుట్రలు పన్నుతూ వైసీపీని సర్వనాశనం చేస్తున్నాడని కంబదూరు మాజీ ఎంపీపీ తలారి తిమ్మరాజమ్మ, వైసీపీ బీసీ విభాగ జిల్లా ప్రధాన కార్యదర్శి ములకనూరు గోవిందు విమర్శించారు. వారు ఆదివారం ములకనూరులో విలేకరులతో మాట్లాడుతూ.. ఇటీవల నిర్వహించిన ఎంపీపీ ఉప ఎన్నికల్లో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ప్రలోభాలకు గురి చేశారని తలారి రంగయ్య చేసిన ఆరోపణలు అవాస్తవం అన్నారు. ఎంపీపీ పదవికి రాజీనామా చేస్తే.. పార్టీ మండల కన్వీనర్‌గా నియమిస్తామని నమ్మపలికి తమను తలారి రంగయ్య నట్టేట ముంచాడని ఆరోపించారు. తమకు రాజకీయ భవిష్యత్తు లేకుండా కుట్రలకు తెరలేపుతున్నాడని విమర్శించారు. జగన్‌రెడ్డి దృష్టిలో పడాలని రంగయ్యే రాజకీయ హైడ్రామాకు తెరలేపుతూ.. కుట్రలు, కక్షలకు ఆజ్యం పోస్తున్నాడని వాపోయారు. మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ వర్గీయులమని తమను మొదటి నుంచి దూరం పెడుతున్నాడని అన్నారు. తలారి రంగయ్య మోసాలు, రాజకీయ కుట్రలను జగన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ప్రశాంతంగా ఉన్న నియోజకవర్గంలో ఆయన వచ్చినప్పటి నుంచి వైసీపీ గ్రూపు రాజకీయాలతో చిన్నాభిన్నంగా మారిపోయిందని విమర్శించారు. ఏళ్లుగా వైసీపీలో ఉన్నామనీ, తమ కుటుంబంపై ఆరోపణలు చేస్తూ.. ఇబ్బందులకు గురిచేస్తున్నాడని అన్నారు.

రహమత్‌నగర్‌లో హత్య

వ్యక్తిగత విషయాలపై రూమ్‌మేట్‌ల గొడవ

ఒకరిని హేళన చేసిన మరొకరు

రాయితో తలపై బాదడంతో మృతి

అనంతపురం క్రైం, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): ఓ బిర్యానీ సెంటర్‌లో పనిచేస్తున్న ముగ్గురూ మద్యం తాగారు. ఆ మత్తులో వారి వ్యక్తిగత సమస్యపై వాదులాడుకున్నారు. ఈ క్రమంలో ఒకరు మిగిలిన ఇద్దరిపై దాడి చేశారు. అందులో ఒకడు అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటన నగరంలోని రహమత్‌నగర్‌లో జరిగింది. కోర్టురోడ్డులోని ఐటీఐ మిట్టపైన గల లింగమయ్య బిర్యానీ సెంటర్‌లో శ్రీధర్ అలియాస్ సిరి, నూర్ మహమ్మద్, గణేష్ పనిచేస్తున్నారు. శ్రీధర్ రహమత్‌నగర్ నివాసి. ఇప్పటికే శ్రీధర్ సొంత ఇంటిని అమ్మేయడంతో పాటు భార్యకు విడాకులు ఇచ్చాడు. రాప్తాడు మండలం చిన్మయనగర్‌కు చెందిన నూర్ మహమ్మద్(43)కు వివాహమైంది. బళ్లారికి చెందిన ఇరవై రెండేళ్ల కుర్రాడు గణేష్ అక్కడే పనికి కుదిరాడు. ఈ ముగ్గురూ ఒకే బిర్యానీ సెంటర్లో పనిచేస్తుండటంతో రహమత్‌నగర్‌లోని మూడోక్రాస్‌లో ఓ గది అద్దెకు తీసుకున్నారు. ఆదివారం మధ్యాహ్నం ముగ్గురూ కలిసి గదిలో మద్యం సేవించారు. ఈ క్రమంలో నూర్‌మహమ్మద్.. శ్రీధర్‌నుద్దేశించి పరుషంగా మాట్లాడాడు. దీంతో శ్రీధర్ కోపంతో రగిలిపోయాడు. మధ్యలో గొడవలు పెడుతున్నాడని తొలుత గణేష్‌పైనా దాడికి దిగాడు. కొంతసేపటికి నీరు తీసుకు రావడానికి గణేష్ బయటకు వెళ్లాడు. అదే క్రమంలో శ్రీధర్ గదిలో ఉన్న ఓ పదునైన రాయితో నూర్‌మహమ్మద్ చెవిపై భాగంలో తలపై బలంగా కొట్టాడు. దీంతో తీవ్ర రక్తగాయానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న టూటౌన్ సీఐ శ్రీకాంత్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా పరారైన శ్రీధర్‌తోపాటు గణేష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

ట్రాక్టర్ కిందపడి యువకుడి మృతి


విజయరాఘవేంద్ర మృతదేహం

గుత్తిరూరల్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దొడి గ్రామ శివారులో ఆదివారం ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కింద పడి విజయరాఘవేంద్ర (20)అనే యువకుడు మృతి చెందాడు. గ్రామానికి చెందిన విజయ రాఘవేంద్ర ట్రాక్టర్‌కు కూలి పనికి వెళ్లాడు. గ్రామం నుంచి పొలంలోకి ఎరువును తీసుకెళ్లారు. ట్రాక్టర్ డ్రైవరు రఘు లిఫ్ట్ ఎత్తగా అది పనిచేయలేదు. దీంతో విజయరాఘవేంద్ర దానిని పరిశీలిస్తుండగా ఒక్కసారిగా ట్రాలీ మీద పడడంతో అక్కడికి అక్కడే మృతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో మహిళ..

కదిరిఅర్బన్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని కౌలేపల్లిలో ఆదివారం విద్యుదాఘాతంతో మమతమ్మ (49) మృతిచెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. కౌలేపల్లిలో నివాసం ఉంటున్న రామమోహన్‌రెడ్డి భార్య మమతమ్మ మిక్సీ వేస్తుండగా.. విద్యుత్ సరఫరా కావడంతో షాక్ కొట్టి కిందపడిపోయింది. కుటుంబ సభ్యులు ఆమెను వెంటనే కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. దీనిపై కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు.

బొప్పాయి చెట్ల నరికివేత

ఉరవకొండ, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలం వెంకటాంపల్లి చిన్నతండాలో రూపానాయక్‌కు చెందిన బొప్పాయి చెట్లను ఆదివారం గుర్తుతెలియని వ్యక్తులు నరికివేశారు. రూపానాయక్ రెండు ఎకరాల్లో బొప్పాయి పంట సాగు చేశారు. పంట కాయదశలో ఉండగా సుమారు 300 బొప్పాయి చెట్లను నరికివేసినట్లు రైతు తెలిపాడు. రూ.4లక్షలు వరకూ నష్టం వాటిల్లిందని బాధితుడు పేర్కొన్నాడు.


నరికివేసిన బొప్పాయి చెట్లు


తలంబ్రాల వేడుక

కల్యాణం.. కమనీయం..

భద్రాద్రిలో వైభవంగా సీతారాముల పరిణయం

దక్షిణ అయోధ్యగా భాసిల్లుతున్న భద్రాచలంలో సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. ఈ వేడుకకు సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించగా పలువురు ప్రముఖులు హాజరయ్యారు.

భక్తి పారవశ్యంలో సినీ నటి కొణిదెల నిహారిక


ముత్యాల తలంబ్రాలు తీసుకొస్తున్న దేవదాయశాఖ మంత్రి కొండా సురేఖ

కల్యాణ వేడుకలో సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు, డిప్యూటీ సీఎం భట్టి దంపతులు

టీటీడీ తరపున పట్టువస్త్రాలు సమర్పిస్తున్న చైర్మన్ బీఆర్ నాయుడు


కల్యాణం అనంతరం తిరువీధి సేవకు బయలుదేరిన సీతారాములు


రామాలయంలో అర్చక బృందంతో సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు

అసంబద్ధ నిర్ణయాలపై

ఉద్యమిస్తాం: ఏపీటీఎఫ్


మాట్లాడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసనాయక్

అనంతపురం విద్య, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 117 రద్దు తర్వాత స్కూళ్ల పునర్నిర్మాణంలో అసంబద్ధ నిర్ణయాలతో తప్పు చేస్తే.. ఉద్యమిస్తామని ఏపీటీఎఫ్ నాయకులు హెచ్చరించారు. ఆదివారం ఆ సంఘం నాయకులు ఉపాధ్యాయభవన్‌లో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి శ్రీనివాసనాయక్ మాట్లాడుతూ... ప్రభుత్వం అప్‌గ్రేడ్ కాని ప్రాథమికోన్నత స్కూళ్లను రద్దు చేయకుండా యథావిధిగా కొనసాగించాలన్నారు. గత ప్రభుత్వంలో టీచర్లపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని కోరారు. టీచర్ల సీనియారిటీ జాబితాలోని తప్పులను సరిచేయాలని తెలిపారు. 117 రద్దు తర్వాత స్కూళ్ల పునర్నిర్మాణంలో అసంబద్ధ సంస్కరణలు చేస్తే ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు కులశేఖర్‌రెడ్డి, వెంకటసుబ్బయ్య, మహమ్మద్ రఫీ, వజీర్ బాషా, అశోక్ నాయక్, నరసింహులు, రమేష్‌రెడ్డి, సూరి, నాగిరెడ్డి పాల్గొన్నారు.

అరకు కాఫీ పొడితో బాలరాముడి చిత్రం



రామగిరి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం పేరూరు గురుకుల పాఠశాల చిత్రకళా ఉపాధ్యాయుడు శ్రీరాములు అయోధ్య బాలరాముడి చిత్రాన్ని చిత్రీకరించారు. శ్రీరామనవమి సందర్భంగా పాఠశాలలో అరకు కాఫీ పొడితో బాలరాముడి చిత్రాన్ని అపరూపంగా చిత్రించారు. ఈ చిత్రాన్ని చూసిన ఉపాధ్యాయులు, విద్యార్థులు శ్రీరాములును అభినందించారు.

రెండు బైక్‌ల దగ్ధం

అనంతపురం క్రైం,ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): ఇద్దరి మధ్య గొడవ నేపథ్యంలో ఓ వ్యక్తి రెండు బైక్‌లను కాల్చి వేశాడు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు నగరంలోని నవోదయకాలనీకి చెందిన దూదేకుల భానుబీ, చాకలి రాజేష్‌కు పరిచయముంది. ఇద్దరూ కొన్ని రోజుల క్రితం గొడవ పడ్డారు. ఈ క్రమంలో కడప జిల్లా లింగాల మండలం మురారిచింతలకు చెందిన భానుబీ సోదరుడు మునీర్‌బాషా తన సోదరి ఇంటికి వచ్చాడు. రాజేష్, భానుబీ మధ్య మరోసారి వాగ్వాదం జరగడంతో మునీర్‌బాషా సర్దిచెప్పే ప్రయత్నం చేశాడు. అర్ధరాత్రి దాటాక మునీర్‌బాషా, భానుబీ బైక్‌లను కాల్చివేశాడు. దీంతో రాజేష్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రేపు పాపిరెడ్డిపల్లికి జగన్

- పర్యటన ఖరారు

ధర్మవరం, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌రెడ్డి పర్యటన ఖరారైంది. రామగిరి మండలం పాపిరెడ్డిపల్లిలో ఇటీవల జరిగిన ఘర్షణలో మృతి చెందిన కురుబ లింగమయ్య కుటుంబాన్ని పరామర్శించడానికి మంగళవారం ఆయన రానున్నారు. బెంగళూరు నుంచి ఉదయం 10 గంటలకు హెలీక్యాప్టర్‌లో బయలుదేరి సీకేపల్లికి చేరుకుంటారు. 10.50 గంటలకు చెన్నేకొత్తపల్లి నుంచి రోడ్డు మార్గాన పాపిరెడ్డిపల్లికి చేరుకుంటారు. 11.10 గంటలకు వైసీపీ కార్యకర్త కురుబ లింగమయ్య కుటుంబ సభ్యులను పరామర్శిస్తారు. 12.30 గంటలకు తిరిగి బెంగళూరుకు వెళతారు.

జగన్ పర్యటనను అడ్డుకుంటాం

ఎస్సీ వర్గీకరణపై వైఖరిని ప్రకటించాలి

ఎమ్మార్పీఎస్ నేత బీసీఆర్ దాస్

అనంతపురంరూరల్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి పర్యటను అడ్డుకుంటామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు బీసీఆర్ దాస్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర శాసనమండలిలో ఎస్సీ వర్గీకరణ బిల్లుకు వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి మద్దతు ఇవ్వాలని మందకృష్ణ మాదిగ పదేపదే కోరుతున్నారని అన్నారు. జగన్ వైఖరి చూస్తుంటే ఎస్సీ వర్గీకరణ బిల్లుపై, మాదిగల పట్ల నిర్లక్ష్య ధోరణి స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు. మీడియా ముందు ఎస్సీ వర్గీకరణ బిల్లుకు మద్దతు ప్రకటించిన తరువాతే అనంతపురం రావాలన్నారు. లేకపోతే ఏమూల దిగినా ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ శ్రేణులు అడ్డుకుంటాయన్నారు. జాతి లక్ష్యాన్ని, ఆత్మగౌరవాన్ని, మాదిగ అమరవీరుల ఆశయాలను నెరవేర్చుకునేందుకు ఎంతటి కష్టానికైనా సిద్ధపడతామని హెచ్చరించారు. ఇందుకు మాదిగ శ్రేణులందరూ సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

న్యూస్ బాక్స్

పశువుల సంత ఆదాయం రూ. 3.36 లక్షలు

అనంతపురం రూరల్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌కు పశులసంతతో రూ. 3,36,440 ఆదాయం వచ్చిందని మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు ఆదివారం తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా రూ.2,25,090, ఆదివారం జరిగిన ఎనుములు, ఎద్దులు, ఆవుల సంతతో రూ.1,41,350 వచ్చిందని తెలిపారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

రాప్తాడు, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందని, మండలస్థాయి అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు హాజరుకావాలన్నారు.

ఘనంగా వాల్మీకి మహర్షి విగ్రహావిష్కరణ


అలంకరణలో వాల్మీకి విగ్రహం

నార్పల, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన వాల్మీకి మహర్షి విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించారు. నిర్వాహకులు బాలనాగి నరేశ్ తదితరులు మాట్లాడుతూ దాతల విరాళాల సహకారంతో నార్పలలో వాల్మీకి విగ్రహం ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి కులస్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చందనోత్సవం


రామచంద్ర నగర్‌లో బాబా విగ్రహానికి చందనం పూస్తున్న అర్చకుడు

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): షిర్డీ సాయినాథుడు జీవించి ఉన్నపుడు ప్రతియేటా శ్రీరామనవమి పర్వదినాన నిర్వహించిన చందనోత్సవ వేడుక నిర్వహించేవారని పలువురు భక్తులు పేర్కొన్నారు. ఆ ఆచారాన్ని కొనసాగిస్తూ ఆదివారం సాయంత్రం నగరంలోని పలు సాయి మందిరాల్లో భక్తిశ్రద్ధలతో చందనోత్సవాన్ని నిర్వహించారు. ఈ నేపథ్యంలో రామచంద్రనగర్‌లోని షిర్డీసాయి ఆలయంలో సాయినాథుడి మూలవిరాట్‌ను చందనంతో అభిషేకించి, ప్రత్యేక అలంకరణ, పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకుడు మారుతి ప్రసాద్, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా మాస్టర్‌మైండ్ స్కూల్ వార్షికోత్సవం


బహుమతులు పొందిన విద్యార్థులతో ముఖ్య అతిథులు

అనంతపురం రూరల్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజీవ్‌కాలనీలో ఉన్న మాస్టర్‌మైండ్ స్కూల్ దశమ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా జూనియర్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ జయశేఖర్‌రెడ్డి, మోటివేషనల్ టీచర్ రవికుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చదువుతోపాటు సంస్కారం, విలువల గురించి తెలియజేశారు. విద్యార్థులు సెల్‌ఫోన్ వాడకం తగ్గించి, క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. అనంతరం సైన్స్ ఫెయిర్, క్రీడా పోటీలు తదితర వాటిలో గెలుపొందిన విద్యార్థులకు ముఖ్యఅతిథులు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గౌసియా బాను తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

రాప్తాడు, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి చెందిన గొరవ కిష్టయ్య రెండో కుమారుడు మిధున్‌ప్రీతం (18) శనివారం రాత్రి బెంగళూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రాప్తాడుకు చెందిన గొరవ కిష్టయ్య పామిడి మండలంలో పోలీస్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. ఆయనకు ఇద్దరు కుమారులు. రెండో కుమారుడు మిధున్‌ప్రీతం అనంతపురంలోని నారాయణ కళాశాలలో ఇంటర్ సెకెండియర్ చదివి ఈ ఏడాది పరీక్షలు కూడా రాశాడు. గత నెల మార్చి 13న మిధున్ ప్రీతం రాప్తాడులో ఇంట్లో ఉన్న సమయంలో పొలంలో వాడే పురుగుల మందును పొరపాటున తాగడం వలన అస్వస్థకు గురయ్యాడు. అతడిని అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. మార్చి 16న మెరుగైన చికిత్స కోసం బెంగళూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు.

మహిళా కూలీ ఆత్మహత్య

అనంతపురం క్రైం,ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): నగరంలో ఓ మహిళా కూలి ఆత్మహత్య చేసుకుంది. నగరంలోని రాయల్ నగర్‌లో రాజా, రత్న(35) దంపతులు నివాసముంటున్నారు. వీరికి కొడుకు, కుమార్తె సంతానం. ఇద్దరూ కూలి పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. గత కొంతకాలంగా రత్న కడుపునొప్పితో బాధపడుతుండేది. ఈ క్రమంలో శనివారం తెల్లవారుజామున తన ఇంట్లో ఉరివేసుకుని మృతిచెందింది. ఘటనపై నాలుగో పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


కోర్టురోడ్డు అభయాంజనేయస్వామి ఆలయంలో కల్యాణోత్సవం


రామస్వామి గుడి వద్ద సీతారాముల దర్శనం కోసం క్యూలో నిల్చున్న భక్తులు


రెవెన్యూ కాలనీలో స్వామివార్ల నగరోత్సవం

ఊరూవాడా మార్మోగిన రామనామం

● ఆలయాల్లో వైభవంగా సీతారాముల కల్యాణోత్సవం

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి వేడుకలను ఆదివారం జిల్లా వ్యాప్తంగా వైభవోపేతంగా నిర్వహించారు. సీతా రాముల కల్యాణోత్సవంతో పాటు పలు ప్రాంతాల్లో ఉట్టికొట్టడం, ఉట్లమాను పరుష, పానకం, వడపప్పు వితరణ, అన్నదానం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. దీంతో ఊరూవాడా రామనామస్మరణ మార్మోగింది. జిల్లాలోని అన్ని రామమందిరాలూ భక్తులతో కిటకిటలాడా యి. జానకి రాముడి కల్యాణాన్ని కనురాలా వీక్షించి అనంత భక్తజనం పులకించి పోయింది. గ్రామీణ ప్రాంతాల్లో సైతం శ్రీరామనవమి వేడు కలతో ప్రజలు ఉత్సాహంగా నిర్వహించారు. జిల్లాకేంద్రంలో పాతూరులోని పురాతన రామస్వామి గుడిలో రాములవారికి విశేష అలంకరణ, అర్చనలు, పూజలు చేశారు. సాయంత్రం నిర్వహించిన ఉట్టికొట్టే కార్యక్రమంలో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉట్లమాను ఎక్కేందుకు పోటీపడ్డారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రామాంజినేయులు, భక్తులు పాల్గొన్నారు. మొదటి రోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ ఆవరణలో ధ్వజారోహణ చేశారు. అనంతరం సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం విశేషంగా అలంకరించిన శేషవాహనంపై సీతారాములను ఊరేగించారు. ఆజాద్ నగర్‌లోని దత్తమందిరం వద్ద ధర్మకర్త డాక్టర్ నలుబోలు మధురాయల్ దంపతుల నేతృత్వంలో కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం అన్నదానం ప్రారంభించారు. కోర్టురోడ్డులోని అభయాంజనేయస్వామి దేవాలయంలోనూ సీతారాముల కల్యాణోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. శ్రీనివాసనగర్‌లోని రామాంజ నేయస్వామి దేవాలయం వద్ద ధర్మకర్త ఆళ్లగడ్డ రాము నేతృత్వంలో కల్యాణోత్సవం నిర్వహించారు. సోమనాథ్‌నగర్ కోదండ రామాలయంలో సీతారాముల కల్యాణోత్సవంతో పాటు అన్నదానం నిర్వహించారు. పాతూరు వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం, విద్యుత్‌నగర్ కాలనీలోని పంచముఖాంజనేయస్వామి దేవాలయం, లక్ష్మీనగర్, విద్యారణ్య నగర్, మారుతీనగర్, రెవెన్యూకాలనీ, అంబేడ్కర్ నగర్, బుడ్డప్పనగర్ తదితర ప్రాంతాల్లోని రామాలయాలన్నింటిలోనూ శ్రీరామ నవమి వేడుకలను కన్నులపండువగా నిర్వహించారు.


శ్రీనివాసనగర్ రామాలయంలో కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం


ఆజాద్‌నగర్‌లో అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం


లక్ష్మీనగర్ రామాలయంలో కల్యాణోత్సవంలో పాల్గొన్న ఆలయ కార్యవర్గం

గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలు

అనంతపురం రూరల్, ఏప్రిల్6(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాములరాయి, పాపంపేట, కట్టకిందపల్లి, ఆకుతోటపల్లి, పూలకుంట, ఇటుకలపల్లి, చియ్యేడు తదితర గ్రామాల్లో సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు, పానకాలు అందించారు. అన్నదానం చేపట్టారు. సాయంత్రం సీతారాముల ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు.

● గార్లదిన్నె: మండలంలోని కల్లూరు అగ్రహారం, మర్తాడు, కొట్టాలపల్లి, జంబులదిన్నె, తిమ్మంపేట, సంజీవపురం, పెనకచెర్ల, పెనకచెర్ల డ్యాం, కొప్పలకొండ తదితర గ్రామాల్లో ఆదివారం సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. దీంతో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అనంతరం భక్తులకు అన్నదానం, తీర్థప్రసాద వినియోగం చేపట్టారు. అలాగే

● రాప్తాడు: మండలంలోని హంపాపురం సమీపంలోని మౌనగిరి క్షేత్రంలో ఆ క్షేత్ర వ్యవస్థాపకులు ఈశ్వరయ్య ఆధ్వర్యంలో 39 అడుగుల ఏకశిలా ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించారు. రాప్తాడు సీఐ శ్రీహర్ష దంపతులు హాజరయ్యారు. అలాగే మండలంలోని రామాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. బండమీదపల్లిలో రాముడి చిత్ర పటాన్ని ఊరేగించారు.

● చెన్నేకొత్తపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సీతారాముల కల్యాణోత్సవాన్ని ఘనంగా జరిపించారు. ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. న్యామద్దల గ్రామంలో 1996-97 పదో తరగతి గోల్డెన్ బ్యాచ్, గ్రామపెద్దల ఆధ్వర్యంలో సీతారామల రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు. అన్నదానం, తీర్థప్రసాద వినియోగం చేపట్టారు.

● శింగనమల: శ్రీరామ నవమి వేడుకలను మండలంలోని పెరవలి, నిదనవాడ, సలకంచెరువు తదితర గ్రామాల్లో ఘనంగా జరుపుకున్నారు. శింగనమలలోని ఆత్మనివేదన రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సీతారాముల పటాన్ని ఊరేగించారు. బైక్ ర్యాలీ నిర్వహించారు.


పాములరాయిలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న గ్రామస్తులు


కల్లూరు అగ్రహారంలో...


మౌనగిరి క్షేత్రంలో సీతారాముల కల్యాణం


న్యామద్దలలో సీతారాముల రథోత్సవం

వేడుకలకు హాజరైన ఎంపీ అంబికా


వాల్మీకి కల్యాణ మండపంలో కల్యాణోత్సవానికి హాజరైన ఎంపీ అంబికా

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం నిర్వహించిన శ్రీరామనవమి వేడుకలకు ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ హాజరయ్యారు. స్థానిక వాల్మీకి కల్యాణమండపంలో నిర్వహించిన వేడుకలకు ఎంపీ ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్థానిక అంబేడ్కర్ నగర్, రెవెన్యూ కాలనీలోని సీతారాముల ఆలయాల్లో ఎంపీ.. స్వామి వారిని దర్శించుకున్నారు. వేద పండితులు ఆయనను ఆశీర్వదించారు.

పలు ఆలయాల్లో ఎమ్మెల్యే పరిటాల సునీత పూజలు


శ్రీహరిపురంలో సీతారాముల కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే

రామగిరి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): శ్రీరామచంద్రుని దీవెనలు అందరికి ఉండాలని ఎమ్మెల్యే పరిటాల సునీత ఆకాంక్షించారు. పితృవాక్య పాలనలో, వ్యక్తిత్వంలో విలువలతో కూడిన సమాజ స్థాపన లో... ఇలా అన్నింటా శ్రీరాముడు ఆదర్శమని పేర్కొన్నారు. శ్రీరామనవమి సందర్భంగా మండలంలోని శ్రీహరిపురం, నసనకోట ఆంజనేయస్వామి ఆలయాల్లో నిర్వహించి సీతారాముల కల్యాణోత్సవ వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. శ్రీహరిపురంలో పరిటాల కుటుంబం స్వయంగా పాల్గొని సీతారాముల కల్యాణాన్ని జరిపించారు. కార్యక్రమాల్లో బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు రంగయ్య, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి మారుతీ ప్రసాద్, నాయకులు రఘు, శ్రీధర్‌నాయుడు, జయచంద్రనాయుడు, రామ్మూర్తినాయుడు, గురు తదితరులు పాల్గొన్నారు.

సీతారామాంజనేయ దేవాలయంలో అన్నదానం


అన్నదానం చేస్తున్న ఆలయ కమిటీ సభ్యుడు చంద్రకాంత్ నాయుడు, భక్తులు

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం స్థానిక కలెక్టరేట్ ఎదురుగా ఉన్న సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో సీతారాముల కల్యాణాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు హాజరయ్యారు. అనంతరం పానకం, ప్రసాదం పంపిణీ, అన్నదానం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తపోవనంలో పానకం పంపిణీ

అనంతపురం రూరల్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎ.నారాయణపురం పంచాయతీ పరిధిలోని తపోవనం సర్కిల్‌లో శ్రీరామ నవమి పండుగను పురస్కరించుకుని పానకం పంపిణీ చేపట్టారు. ఆదివారం శ్రీరామనవమి పండుగ సందర్భంగా నారాయణ పురం యూత్ ఆధ్వర్యంలో తపోవనం సర్కిల్‌లో భక్తాదులందరికీ పానకం, ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ మాజీ ఎంపీటీసీ రాయల్ మురళి తదితరులు పాల్గొన్నారు.

42వ డివిజన్‌లో ప్రత్యేక పూజలు

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): నగరంలోని 42వ డివిజన్ పరిధిలో ఉన్న శ్రీరాముడి ఆలయంలో శ్రీరామనవమి పండుగను పురస్కరించుకొని ఆదివారం టీడీపీ నాయకుడు ఓంకార్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు గంగారామ్ , నాయకులు సుందర్, రాయల్ మురళి, ఇస్మాయిల్, రామాంజి, శ్రీనివాసులు, మహబూబ్ బాషా, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

10వ డివిజన్‌లో... నగరంలోని 10వ డివిజన్‌లోని శ్రీరాముడి ఆలయంలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజ నిర్వహించిన అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పోతుల లక్ష్మీనరసింహులు, సీపీఐ నగర కార్యదర్శి శ్రీరాములు, మాజీ కౌన్సిలర్ లింగమయ్యలు హాజరయ్యారు.

బైక్ ర్యాలీ

నార్పల, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): విశ్వ హిందూ పరిషత్ పిలుపుమేరకు శ్రీరామనవమి సందర్భంగా అనంతపురంలో జరిగిన భారీ బైక్ ర్యాలీకి నార్పల నుంచి పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. ఆదివారం నార్పల తిక్కయ్య స్వామి గుడి నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ గ్రామ వీధులలో పూర్తిచేసుకుని అనంతపురం తరలి వెళ్లింది. సిద్ధార్థ పిరమిడ్ ధ్యాన కేంద్ర సభ్యులు గవ్వల శివ, ఈడిగ శ్రీధర్ పాల్గొన్నారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ వేడుకలు

● హాజరైన మంత్రి సత్యకుమార్, మెదక్ ఎంపీ రఘునందన్



మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్ యాదవ్, చిత్రంలో ఎంపీ రఘునందన్

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ(బీజేపీ) ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ రావి చైతన్య కిషోర్ ఆధ్వర్యంలో చేపట్టిన భారీ బైక్ ర్యాలీకి వేలాదిమంది కార్యకర్తలు తరలివచ్చారు. అనంతరం పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన వేడుకలకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖమంత్రి సత్యకుమార్ యాదవ్, తెలంగాణ మెదక్ ఎంపీ రఘునందన్ రావు హాజరై మాట్లాడారు. కుటుంబ వారసత్వంగా కాకుండా, కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు పదవులు అందించే ఏకైక పార్టీ బీజేపీ అన్నారు. ఆర్థికంగా ప్రపంచంలో 11వ స్థానంలో ఉన్న దేశాన్ని మోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టి నాలుగో స్థానానికి తీసుకొచ్చారని పేర్కొన్నారు. గ్రామ స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పనిచేస్తుండటంతో బీజేపీ ప్రజల గుండెల్లో నిలిచిందన్నారు. ఇదే ఒరవడిని కొనసాగిద్దాని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు నాయకులతోపాటు అశోక్‌రెడ్డి, విశ్వనాథ్, అజేష్ యాదవ్, పెద్దయ్య, రాము, రమేష్, వెంకటస్వామి, చెన్నకేశవనాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● చెన్నేకొత్తపల్లి: భారతీయ జనతాపార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని చెన్నేకొత్తపల్లిలో ఆదివారం ఆ పార్టీ శ్రేణులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు శివమూర్తి, సీనియర్ నాయకులు జిలకర ఆంజనే యులు, శ్రీనివాసులరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎన్‌ఎస్‌ఎస్ సేవా కార్యక్రమాలు

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): ఆర్ట్స్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. ప్రోగ్రాం ఆఫీసర్ విష్ణుప్రియ ఆధ్వర్యంలో గురువారం నుంచి కురుగుంటలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆదివారం గ్రామ వీధుల్లో మొక్కలు నాటారు. 'మొక్కలు నాటుదాం-ప్రకృతిని పరిరక్షిందాం' అనే నినాదంతో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కెమిస్ట్రీ, జువాలజీ, బోటని, ఎకనామిక్స్, బయోటెక్నాలజి, కామర్స్ విభాగాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బరువు ఎత్తే పోటీలు

గార్లదిన్నె, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమిని పురస్కరించుకుని కల్లూరు అగ్రహారం గ్రామంలోని ఆంజనేయ స్వామి దేవాలయం సమీపంలో ఆదివారం గ్రామస్థులు, తలారి నాగరాజు ఆధ్వర్యంలో పలు పందేలు నిర్వహించారు. యువకులు, ఉత్సాహవంతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. 151 కేజీల ఇసుక మూట ఎత్తే పందెంలో విడపనకల్లు మండలం పాల్తూరుకు చెందిన రాజు మొదటి బహుమతి రూ. 3వేలు గెలుపొందగా, కల్లూరు అగ్రహారానికి చెందిన సుధాకర్ రెండో బహుమతి రూ.1000 గెలిచాడు. 140 కేజీల రాతి గుండు ఎత్తే పందెం లో కర్నూలు జిల్లా ప్యాపిలి మండలం మాధాపురానికి చెందిన ఈశ్వర్‌రెడ్డి మొదటి బహుమతి రూ 3వేలు గెలుచుకోగా, అదే గ్రామానికి చెందిన రాజశేఖర్ రెండో బహుమతి రూ. 1000 గెలుచుకున్నాడు. ఒంటి చేత్తో 60 కేజీల రాయి (సంధా) ఎత్తే పందేన్ని ప్యాపిలి మండలం మాధాపురానికి చెందిన పసుపుల హుసేన్ 25 సార్లు ఎత్తి మొదటి బహుమతి రూ. 3వేలు గెలుచుకోగా, అదేగ్రామానికి చెందిన ఈశ్వర్‌రెడ్డి ఐదు సార్లు ఎత్తి రెండో బహుమతి రూ.1000 గెలుపొందాడు. ఇరుసు ఎత్తే పందెంలో పామిడి మండలం నాగాలపురానికి చెందిన ఫణేంద్ర మొదటి బహుమతి రూ.4వేలు గెలుపొందగా, వంకరాజు కాలువకు చెందిన నరేష్ రూ.2వేలు గెలుపొందాడు. కర్రసాములో యాడికికి చెందిన రాజేష్ మొదటి బహుమతి రూ.3 వేలు గెలుపొందగా, అదే గ్రామానికి చెందిన నాగార్జున రెండో బహుమతి రూ.2వేలు గెలుపొందాడు. విజేతలకు గ్రామస్థులు బహుమతులు అందజేశారు. ఎస్ఐ మహమ్మద్ గౌసబాషా ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు నిర్వహించారు. గ్రామస్థులు తలారి నాగరాజు, జెన్నె కుళ్లాయప్ప, రమణ తదితరులు పాల్గొన్నారు.


151 కిలోల ఇసుక మూట ఎత్తుతున్న పాల్తూరు రాజు

కమనీయం.. సీతారాముల కళ్యాణం

● వైభవంగా శ్రీరామనవమి వేడుకలు ● ఆలయాల్లో ప్రత్యేక పూజలు ● పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులు

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: శ్రీరామనవమి పర్వదిన వేడుకలను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గుంతకల్లు, ఉరవకొండ, తాడిపత్రి, శింగనమల, కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల్లోని అన్ని ప్రాంతాల్లో వేడుకలను అత్యంత వైభవంగంగా జరిపారు. ఈ సందర్భంగా ఉదయాన్నే రామాలయాలు, ఆంజనేయ స్వామి ఆలయాలతో పాటు వివిధ ఆలయాల్లో అర్చకులు మూలవిరాట్‌లకు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, పూజలు చేశారు. అనంతరం వేదపండితులు ఆలయాల ప్రాంగణాల్లో చలవ పందిళ్లు ఏర్పాటు చేసి అందులో సీతారాముడి ఉత్సవ విగ్రహాలను కొలువుదీర్చి పట్టువస్త్రాలు, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. తర్వాత వేదమంత్రోచ్చారణలు, ముత్యాల తలంబ్రాలు, మంగళవాయిద్యాల నడుమ కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అభిజిత్ లగ్నంలో సీతమ్మవారి మెడలో శ్రీరామచంద్రుడు మాంగళ్యధారణ చేశారు. నేత్ర పర్వంగా సాగిన ఈ వేడుకలను చూసేందుకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఆలయాల నిర్వాహకులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అన్నప్రసాద వితరణ చేపట్టారు. అనంతరం సాయంత్రం ఉత్సవమూర్తులను పల్లకిలో ఉంచి ఊరేగించారు. రామనామంతో ఆలయాలు మార్మోగాయి. ఊరేగింపులో పలువురు కళాకారులు చేపట్టిన కోలాటాలు, నృత్యాలు అలరించాయి. పలుచోట్ల విశ్వ హిందూ పరిషత్ వారు జైశ్రీరాం అని నినదిస్తూ బైక్ ర్యాలీలు సైతం నిర్వహించారు. అదేవిధంగా రాతిదూలం లాగుడు పోటీలు కూడా జరిగాయి. కణేకల్లు మండలకేంద్రంలో జరిగిన శ్రీరాముడి శోభాయాత్రలో, గుమ్మఘట్ట మండలం భూపసముద్రంలో నిర్వహించిన రాములవారి రథోత్సవంలో ప్రభుత్వవిప్ కాలవశ్రీనివాసులు పాల్గొని పూజలు చేశారు. తాడిపత్రి పట్టణంలోని యల్లనూరురోడ్డు సర్కిల్లో ఉన్న రామాలయంలో ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి పూజలు చేయించారు. గుత్తి పట్టణంలోని కోట వీధిలో గల పురాతన రామాలయంలో గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడుయాదవ్, ఎమ్మెల్యే తనయుడు గుమ్మనూరు ఈశ్వర్ పాల్గొని ప్రత్యేకపూజలు చేయించారు. అలాగే గుత్తి మండలం జక్కల చెరువు గ్రామంలోనూ వారు పూజలు చేయించారు. కళ్యాణదుర్గం మండలం దురదకుంట గ్రామంలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తరఫున ఆయన వ్యక్తిగత కార్యదర్శి రాకేశ్, మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ లక్ష్మీదేవి దంపతులు సీతారాములకు పట్టు వస్త్రాలు సమర్పించి పూజలు చేయించారు.


బెళుగుప్ప మండలం గుండ్లపల్లిలో ప్రత్యేకాలంకరణలో సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయస్వామి మూలవిరాట్లు


గుత్తి మండలం జక్కలచెరువులో విశేషాలంకరణలో ఉత్సవమూర్తులు


గుమ్మఘట్ట మండలం భూపసముద్రంలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు


బ్రహ్మసముద్రం మండలం పాలవెంకటాపురంలో కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు


యాడికిలో..


కణేకల్లులో శ్రీరాముడి శోభాయాత్రలో పాల్గొన్న ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు


తాడిపత్రిలోని యల్లనూరు రోడ్డు రామాలయంలో పూజలు చేయిస్తున్న ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి



గుత్తిలో స్వామివారిని దర్శించుకుంటున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం


తులసి, పుష్పాల అలంకరణలో నేమకల్లు ఆంజనేయస్వామి


కళ్యాణదుర్గం మండలం దురదకుంటలో పట్టువస్త్రాలు తీసుకెళ్తున్న మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ లక్ష్మీదేవి దంపతులు


కూడేరులో సీతారాముల ఉత్సవమూర్తుల ఊరేగింపు


శెట్టూరు మండలం కనుకూరులో రథోత్సవం


పామిడిలో వీహెచ్‌పీ నాయకుల బైక్ ర్యాలీ

ఘనంగా మహర్షి వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠ

కుందుర్పి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆదివారం వాల్మీకుల ఆధ్వర్యంలో మహర్షి వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా జరిగింది. ముఖ్య అతిథులుగా ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, కళ్యాణదుర్గం మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ గోళ్ల లక్ష్మీదేవి, ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి రాకేష్ తదితరులు హాజరయ్యారు. స్థానిక నాయకులతో కలిసి వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. అనంతరం వారిని వాల్మీకులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు.


వాల్మీకి విగ్రహం వద్ద ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

కరిడిపల్లిలో కనకదాస విగ్రహావిష్కరణ

శెట్టూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరిడిపల్లి గ్రామంలో ఆదివారం కురుబ కులస్థులు భక్తకనకదాస విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు వ్యక్తిగత పీఏ రాకేష్‌తో కలిసి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గ్రామంలో కనకదాస విగ్రహం ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. గ్రామస్థులు పెద్దఎత్తున పాల్గొన్నారు.


కనకదాస విగ్రహావిష్కరణలో పాల్గొన్న కురుబ కులస్థులు

వాల్మీకి మహర్షికి ప్రత్యేక పూజలు

రాయదుర్గంరూరల్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమిని పురస్కరించుకుని ఆదివారం నియోజకవర్గ వాల్మీకి సంక్షేమ సేవా సమితి ఉపాధ్యక్షుడు మలకన్న ఆధ్వర్యంలో వాల్మీకులు పట్టణంలోని టవర్‌క్లాక్ వద్ద ఉన్న మహర్షి వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ.. సేవాసమితి నియోజకవర్గ అధ్యక్షుడు బండి కిష్టప్ప సూచనల మేరకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. అలాగే స్థానిక శాంతినగర్‌లో ఉన్న చంద్రబాబునాయుడు పార్కులోని భక్తకన్నప్ప విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. కోశాధికారి బండి చంద్రశేఖర్, న్యాయసలహాదారుడు రవిచంద్ర, నాయకులు తిప్పయ్య, తిప్పేస్వామి, రామాంజనేయులు పాల్గొన్నారు.

మంత్రి కేశవ్‌కు ఘన సన్మానం


మంత్రిని సన్మానిస్తున్న చిన్నముష్టూరు రైతులు

ఉరవకొండ, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా డిస్ట్రిబ్యూటరీ కాలువ కింద భూములు కోల్పోయిన రైతులకు పరిహారం మంజూరు చేయించినందుకు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌ను చిన్నముష్టూరు గ్రామ రైతులు సన్మానించారు. అనంతపురంలోని రాంనగర్‌లో గల నివాసంలో ఆదివారం వారు మంత్రిని కలిసి శాలువా కప్పి గజమాల వేసి సత్కరించారు. పలువురు మాట్లాడుతూ కాలువ కింద భూములు కోల్పోయిన 27మంది రైతులకు మంత్రి కేశవ్ రూ.1.50కోట్లు మంజూరు చేయించారని రైతులు తెలిపారు. అలాగే కోనాపురం చెరువుకు నీళ్లు విడుదల చేయించారని ఆనందం వ్యక్తం చేశారు. టీడీపీ నాయకులు నెట్టెం రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

బెళుగుప్ప: మండలంలోని ఆవులెన్న గ్రామానికి తారురోడ్డు నిర్మాణానికి గాను రూ. 55 లక్షల నిధుల మంజూరుకు చర్య లు తీసుకోవడం పట్ల ఆ గ్రామ టీడీపీ నాయకులు రాష్ట్ర ఆర్థిక శాఖామంత్రి పయ్యావుల కేశవ్‌ను సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాకేంద్రంలోని రామ్‌నగర్‌లో గల నివాసంలో మంత్రిని కలిసి శాలువా, పూలమాలతో సత్కరించారు. సర్పంచ్ రాము, నాయకులు ఎర్రిస్వామి వెంకటస్వామి, వన్నూరుస్వామి, నోమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సంగమేశ్వరుడి బ్రహ్మోత్సవాలు

● 12న మడుగు తేరు, రథోత్సవం
● నూతన రథంలో ఊరేగనున్న స్వామివారు

కూడేరు, ఏప్రిల్ 6, (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో ప్రసిద్ధి గాంచిన జోడులింగాల సంగమేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. అందులో భాగంగా తొలి రోజు రెడ్డి వారి సంఘం ఆధ్వర్యంలో శేష వాహనంపై స్వామివారు గ్రామ పురవీధుల్లో ఊరేగుతారని ఆలయ ఈఓ రమేష్‌బాబు ఆదివారం ప్రకటనలో తెలిపారు. అలాగే 8వ తేదీ మంగళవారం ఈడిగ సంఘం ఆధ్వర్యంలో వ్యాఘ్రవాహనంపై, 9వతేదీన వైశ్య సంఘం ఆధ్వర్యంలో నెమలివాహనంపై, 10వతేదీన కమ్మ సంఘం ఆధ్వర్యంలో నందివాహనంపై, 11వతేదీ వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో ఐరావతం వాహనంపై స్వామివారు గ్రామ పురవీధుల్లో విహరించనున్నట్లు చెప్పారు. అదేరోజున రాత్రి 10 గంటలకు భోగిశెట్టి శివానంద కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవం జరుగుతుందని తెలిపారు. 12వ తేదీ ఉదయం వివిధ రకాల హోమాలు, మడుగుతేరు, సాయంత్రం రథోత్సవం వైభవంగా జరపనున్నట్లు పేర్కొన్నారు. ఇక 13వతేదీన కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో స్వామి వారి అశ్వవాహనంపై మాడవీధుల్లో విహరిస్తారని, అలాగే పార్వేట ఉంటుందని అన్నారు. 14వ తేదీన పోనుగంటి ఆర్యవైశ్య సంఘం ఆకులేటి గ్రామస్థుల ఆధ్వర్యంలో వసంతోత్సవం నిర్వహిస్తామని, అంతటితో ఉత్సవాలు ముగుస్తాయని ఈఓ వివరించారు. భక్తులు భారీగా తరలిరావాలని ఈఓతోపాటు ఆలయ అర్చకులు మహేష్, శివశంకర్‌శాస్త్రి కోరారు.


జోడులింగాల సంగమేశ్వర స్వామి

ఆదివారం రోజున ఆలయంలో..

స్వామివారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కావడంతో ఆదివారం సాయంత్రం ఆలయంలో బ్రాహ్మణ బండారు వంశీకులు పుణ్యాహవచనము, గంగపూజ, గణపతిపూజ, కలశస్థాపన, అంకురార్పణ, ధ్వజారోహణం తదితర పూజలు చేశారు.

బ్రహ్మోత్సవాలకు నూతన రథం..

పూర్వకాలంలో తయారు చేసిన స్వామి వారి రథం శిథిలావస్థకు చేరుకుంది. గత ఏడాది ఉత్సవాల సమయంలో రథం లాగే సమయంలో ఇబ్బందులు తలెత్తాయి. దీంతో ఆలయకమిటీవారు, గ్రామస్థులు నూతన రథం తయారీకి దాతల నుంచి విరాళాలు సేకరించారు. దాదాపు రూ. 65 లక్షల వ్యయంతో రథం తయారీ పనులు వేగవంతంగా జరుగుతున్నా యి. మరో మూడు రోజుల్లో రథం పనులు పూర్తి అయ్యే అవకాశం కనిపిస్తోంది.

భక్తులకు ఏర్పాట్లు..

ఉత్సవాల సందర్భంగా వచ్చే భక్తులకు క్యూలైన్లు ఏర్పాటుతోపాటు తాగునీరు, భోజన వసతిని, ఆలయ అధికారులతో పాటు దాతలు కల్పించనున్నారు. చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు.

నేడు సూరేపల్లిలో చౌడమ్మ జ్యోతులు

పుట్లూరు, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరేపల్లి గ్రామంలో సోమవారం రాత్రికి చౌడమ్మజ్యోతుల కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆ గ్రామపెద్దలు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ఆలయంలోని చౌడమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నామని, రాత్రికి జ్యోతుల ఊరేగింపు చేయనున్నామని చెప్పారు. తర్వాత అమ్మవారికి భక్తులు మొక్కులు తీర్చుకోనున్నారు.

ఘనంగా సీతారామాంజనేయస్వామి తిరుణాల

పుట్లూరు, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగమనాయుని పల్లి గ్రామశివారులో గల సీతారామాంజనేయస్వామి ఆలయం వద్ద తిరుణాలను ఆదివారం అంగరంగవైభవంగా నిర్వహించారు. ఆలయ పరిసర ప్రాంతమంతా భక్తులతో కిక్కిరిసిపోయింది. ఈ సందర్భంగా ఆలయంలో అర్చకులు తొలుత సీతారాములకు, ఆంజనేయస్వామికి ప్రత్యేక అలంకరణలు, పూజలు చేశారు. అనంతరం సీతారాముల ఉత్సవమూర్తులకు కళ్యాణోత్సవం జరిపించారు. అనంతరం పల్లకిలో ఊరేగింపు చేశారు. ఆలయ సమీపంలో రాతిదూలం లాగుడు పోటీలు, గుండు విసురుట, లాంగ్‌జంప్ తదితర పోటీలు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు కూడా చేపట్టారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు.

శ్రీరామిరెడ్డి కార్మికుల నిరసన

కళ్యాణదుర్గంరూరల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులు ఆదివారం పట్టణంలోని పం పుహౌస్‌ను బంద్ చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. గ్రామాల ప్రజల దాహర్తి తీర్చడానికి రేయింబవళ్లు కష్టపడుతున్నామన్నారు. అయినప్పటికీ గత ఆరు నెలల నుంచి జీతాలు అందలేదన్నారు. దీంతో పండుగ పూట తమ కుటుంబాలను పస్తులు పెట్టాల్సి వచ్చిందని వాపోయారు. ఆరు నెలల జీతాలతో పాటు 30 నెలల ఈపీఎఫ్ చెల్లించాలని డిమాండ్ చేశారు. అంతవరకు సమ్మె కొనసాగుతుందని తెలిపారు. వీరికి సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు మద్దతు తెలిపారు. సీఐటీయు జిల్లా అధ్యక్షురాలు నాగమణి, జిల్లా ఉపాధ్యక్షుడు మస్నెల రామాంజి, జిల్లా సహాయ కార్యదర్శి అచ్యుతప్రసాద్, ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

గుంతల రోడ్డుకు మోక్షం

బొమ్మనహాళ్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగానహళ్లి గ్రామం నుంచి సంగమేశ్వరస్వామి ఆలయం వరకు రోడ్డు అభివృద్ధిపై ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు దృష్టి సారించారు. గోతులమయంగా ఉన్న రోడ్డుకు కాలవ శ్రీనివాసులు సహకారంతో మరమ్మతులు చేపట్టినట్లు టీడీపీ నాయకుడు బొంబాయి ఈరన్న ఆదివారం తెలిపారు. ఈ నెల 12 నుంచి సంగమేశ్వర స్వామి ఉత్సవాలు ప్రారంభం అవుతున్న సందర్భంగా భక్తులు ఇబ్బందులు కలుగకుండా గుంతల రోడ్డుకు మట్టి వేసి చదును చేశామన్నారు. అలాగే ఇరువైపులా కంపచెట్లు తొలగించామన్నారు. సుమారు 2 కి.మీ.ల మేర చదును చేసినట్లు చెప్పారు.

ఉత్సాహంగా రాతిదూలం లాగుడు పోటీలు


పోటీలను ప్రారంభిస్తున్న బాలారమేష్‌బాబు

యాడికి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమిని పురస్కరించుకుని మండలకేంద్రంలో ఆదివారం నిర్వహించిన రాతిదూలం లాగుడు పోటీలు ఉత్సాహంగా కొనసాగాయి. చింతవనం ఆంజనేయస్వామి ఆలయం తరఫున నిర్వహించిన ఈ పోటీలను స్థానిక మాజీ ఉప సర్పంచు బాలా రమేష్‌బాబు ప్రారంభించారు. పోటీల్లో మొదటి బహుమతిని పెద్దపేట గ్రామానికి చెందిన చెన్నారెడ్డి వృషభాలు, రెండో బహుమతిని ఈరన్నపల్లికి చెందిన వర వెంకట్రాముడు వృషభాలు, మూడో బహుమతిని ఈరన్నపల్లికే చెందిన వర నాగరాజు వృషభాలు, నాలుగో బహుమతిని చెంద్రాయునిపల్లికి చెందిన రామకృష్ణారెడ్డి వృషభాలు గెలుపొందాయి. విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కమిటీ నిర్వాహకులు భాస్కర్‌రెడ్డి, కళ్లమడి రామ్మూర్తి, సుబ్బారెడ్డి, వడ్డె శంకర, సత్యారంగయ్య, రఘునాథ్‌రెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, మధు, క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

తాడిపత్రి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతాపార్టీ 45వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం పార్టీ రాష్ట్ర లీగల్‌సెల్ కన్వీనర్ పీవీ ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పీవీ ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ 1980 ఏప్రిల్6వ తేదీన పార్టీ ఆవిర్భవించిందన్నారు. నాటి నుంచి నేటివరకు దేశంకోసం పనిచేస్తున్న ఏకైక పార్టీ బీజేపీనేనని అన్నా రు. పార్టీ కోసం జీవితాలను త్యాగం చేసిన నాయకులు, కార్యకర్తలను స్మరించుకున్నారు. నాయకులు అంకాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


తాడిపత్రిలో వేడుకల్లో పాల్గొన్న బీజేపీ నాయకులు

● రాయదుర్గంరూరల్: పట్టణంలోని శాంతినగర్‌లోగల బీజేపీ కార్యాలయంలో పార్టీ జెండాను నాయకులు ఎగురవేసి మిఠాయిలు పంచిపెట్టారు. పార్టీ సీనియర్ నాయకుడు వడే అంబోజీరావు, అసెంబ్లీ కన్వీనర్ హీరోజీరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జింకా వసుంధర తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● కుందుర్పి: మండలకేంద్రంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పార్టీ జెండాను ఆవిష్కరించారు. తరువాత స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన మాజీ కార్యదర్శి ఆదినారాయణ, మండల అధ్యక్షుడు జీ శివశంకర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● గుంతకల్లుటౌన్: పట్టణంలోని పాత గుంతకల్లులోని అంకాలమ్మ గుడి వద్ద బీజేపీ నాయకుల పార్టీ జెండాను ఆవిష్కరించి, టపాసులు పేల్చి, స్వీట్లను పంపిణీ చేశారు. నాయకులు పురంధర్, నారాయణ రెడ్డి శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతులు చేసి.. వదిలేశారు!

● రూ.4లక్షల ప్రజాధనం నిరుపయోగం

యాడికి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): సుమారు రూ.4లక్షల ప్రజాధనం వెచ్చించి మరమ్మతులు చేపట్టిన మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ భవనాన్ని నిరుపయోగంగా మార్చడంపై స్థానికుల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఏడాదిన్నరక్రితం ఎంపీడీఓ కార్యాలయం చిన్న చిన్న మరమ్మతులకు గురికావడంతో రూ.4లక్షలు వెచ్చించి మరమ్మతులు, పెయింటింగ్ పనులు చేయించారు. ఇంత వరకు బాగానే ఉంది. కానీ మరమ్మతులు చేయించిన భవనాన్ని అధికారులు ఎందుకు వినియోగించడం లేదో అర్థకాని పరిస్థితి నెలకొంది. ఈ మాత్రం దానికి మరమ్మతులు ఎందుకు చేపట్టినట్లు అనేది అర్థం కాని ప్రశ్నగానే మిగిలిపోయింది. ఎంపీడీఓ కార్యాలయం నిర్వహణకు అనుకూలంగా ఉండే ప్రధాన భవనాన్ని వదిలేసి దీనివెనుక ఉన్న గదుల్లో కార్యాలయం నిర్వహిచడం లోగుట్టు ఏమిటని స్థానికులు చర్చించుకుంటున్నారు. అధికారులు స్వకార్యాలు నిర్వహించుకోవడానికి ప్రధాన భవనం వెనుక ఉన్న గదులను కార్యాలయ భవనాలుగా మార్చేసుకున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారుల చర్యలతో ఎంపీడీఓ కార్యాలయం ఎక్కడ ఉన్నది కనుక్కోవడం కూడా కొత్తవారికి కష్టమే అని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. లక్షల రూపాయల ప్రజాధనం వెచ్చించి మరమ్మతులు చేయించిన ఎంపీడీఓ కార్యాలయాన్ని వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.


నిరుపయోగంగా ఎంపీడీఓ కార్యాలయ భవనం

ప్రతిఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలి: ప్రభుత్వ విప్

డీ.హీరేహాళ్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ భక్తిభావాన్ని పెంపొందించుకోవాలని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు సూచించారు. మండలంలోని గొడిశలపల్లిలో బయలు ఆంజనేయ స్వామి ఆలయం వద్ద మూడురోజుల ప్రత్యేక పూజలు, హోమాలు అనంతరం ఆదివారం ఆంజనేయస్వామి విగ్రహం, ధ్వజస్తంభ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. వేదపండితులు వేద మంత్రోచ్చారణలతో, శాస్త్రోక్తంగా స్వామివారి విగ్రహాన్ని, ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. ప్రభుత్వ విప్ ముఖ్యఅతిథిగా హాజరై స్వామివారిని దర్శించుకుని పూజలు చేయించారు. అనంతరం మాట్లాడుతూ ఆధ్మాతిక చింతన, భక్తిభావం అలవరచుకోవడం వల్ల సన్మార్గంలో పయనించవచ్చన్నారు. ప్రతిఒక్కరూ భక్తిభావనను పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ హనుమంతరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు గంగాధర, నాయకులు మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

చౌడేశ్వరీదేవి జాతరకు ఆహ్వానం

రాయదుర్గంరూరల్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లాపురం సమీపంలో జరగనున్న చౌడేశ్వరీ దేవి జాతర మహోత్సవానికి ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులుకు మల్లాపురం, పల్లేపల్లి గ్రామపెద్దలు ఆహ్వానం పలికారు. పట్టణంలోని నివాసంలో ఆదివారం వారు విప్‌ను కలిసి జాతరకు రావాలని ఆహ్వానించారు. ఈనెల 7, 8, 9వ తేదీలలో వైభవంగా జాతర జరుగుతుందన్నారు. తొమ్మిది సంవత్సరాల తర్వాత నిర్వహిస్తున్నామని, కార్యక్రమానికి తప్పక హాజరవ్వాలని కోరారు. రెండు గ్రామాల పెద్దలు సదాశివారెడ్డి, కమలాక్షుడు, సిద్ధప్ప తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు

గుత్తి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. కర్నూలు జిల్లా జొన్నగిరికి చెందిన లక్ష్మీదేవి ఆదివారం పని నిమిత్తం గుత్తి పట్టనానికి వచ్చింది. కొద్దిసేపు తర్వాత ఆటోలో స్వగ్రామానికి బయలుదేరింది. ప్రభుత్వాస్పత్రి వద్దకు రాగానే వైనుకవైపున కూర్చున్న ఆమె ప్రమాదవశాత్తూ కిందపడి తీవ్రంగా గాయపడింది. బాధితురాలిని చికిత్స నిమిత్తం ప్రభుత్వఆసుపత్రికి తరలించారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా ఆంజనేయస్వామి రథోత్సవం


రాయదుర్గం మండలం బీఎన్ హళ్లిలో రథోత్సవంలో పాల్గొన్న భక్తులు


బొమ్మనహాళ్ మండలం కురవళ్లిలో..

రాయదుర్గంరూరల్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని రేకులకుంట, బీఎన్‌హళ్లి గ్రామాల్లో శ్రీరామనవమి సందర్భంగా ఆంజనేయస్వామి రథోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయా ఆలయాల్లోని స్వామివార్ల మూలవిరాట్‌లకు అర్చకులు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, పూజలు చేశారు. అనంతరం సాయంత్రం సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయుడి ఉత్సవమూర్తులను రథాలపై కొలువుదీర్చి గ్రామాలపురవీధుల్లో లాగారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

బొమ్మనహాళ్: మండలంలోని కురవళ్లి గ్రామంలోనూ ఆంజనేయస్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. తొలుత ఆలయంలో సీతారాముల కల్యాణంను నిర్వహించారు. తర్వాత సాయంత్రం సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయుడి ఉత్సవ విగ్రహాలను రథంపై ఉంచి ఊరేగించారు. భక్తులు వేలాదిమందిగా పాల్గొన్నారు.